ఈ-పేపర్ తెలుగు డైలీ
ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/

## ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్స్‌కు సీఎం రేవంత్ ఫోన్..


**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 29:** పారిస్ ఒలింపిక్స్ 2024లో భారత్ క్రీడాకారులు పథకాల సాధనకు సిద్ధమైయ్యారు. స్టార్ అథ్లెట్స్ కొంత మంది తమ తొలి రౌండ్‌ను సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేసుకున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ క్రీడాకారులకు సీఎం రేవంత్ రెడ్డి వారికి విషెస్ తెలియజేశారు. ఆయా కేటగిరీల తొలి దశల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తోన్న తెలంగాణ అథ్లెట్స్ నిఖత్ జరీన్ (బాక్సింగ్), శ్రీజ ఆకుల (టేబుల్ టెన్నిస్), పీవీ సింధు (బ్యాడ్మింటన్) లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. అలాగే తన ఈవెంట్ కోసం సిద్ధమవుతోన్న ఇషా సింగ్ (షూటింగ్)కు కూడా సీఎం బెస్ట్ విషెస్ చెప్పారు. వీరంతా తర్వాతి దశల్లోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించి విజయంతో దేశానికి మెడల్స్ సాధించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.





## రెవెన్యూ సమీక్షలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం..

### రాజముద్రతో కొత్త పాసు పుస్తకాలు..!




**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూలై 29:** సీఎం చంద్రబాబు చేపట్టిన రెవెన్యూ సమీక్షలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో రాజముద్రతో భూ యజమానులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందచేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజల పాసు పుస్తకాలపై తన బొమ్మల కోసం రూ.15 కోట్లు తగలేశారంటూ జగన్ ప్రభుత్వంపై చంద్రబాబు మండిపడ్డారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు, ప్రజల కోరిక మేరకు రాజముద్రతో కొత్త పాసు పుస్తకాలు ఇచ్చేందుకు ప్రభుత్వ నిర్ణయం తీసుకోనుంది. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆస్తి వివరాలు, ఆ ఆస్తి అడ్రస్ వద్దకు తీసుకువెళ్లే మ్యాప్ కూడా వచ్చేలా ఏర్పాటు చేస్తుంది ప్రభుత్వం.మరోవైపు.. రీ సర్వే పేరుతో పొలాల సర్వేకి గత ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసిందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. అంతేకాకుండా.. సరిహద్దు రాళ్లపైనా తన బొమ్మలు ఉండాలన్న నాటి సీఎం జగన్ కోరిక తీర్చేందుకు రూ.650 కోట్లు ఖర్చయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. కేంద్రం చెప్పిన రీ సర్వేలో ఎక్కడా రాళ్లు పాతమని చెప్పకున్నా.. తన బొమ్మల కోసం గ్రానైట్ రాళ్లు సిద్ధం చేశారని అధికారులు వెల్లడించారు.

## ఆగస్టు 1, 2న బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై చర్చకు సిద్ధం..

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 29:** ఆగస్టు 1, 2న బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై చర్చకు సిద్ధమని జగదీష్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. మీరెంత అబద్ధాలు చెబితే నేను అంత నిజాలు చెబుతా అన్నారు. అబద్దాలు చెబితే నమ్మడానికి ప్రజలు అమాయకులు కాదన్నారు. విద్యుత్ పై మీరు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని అన్నారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. విచారణ కమిషన్ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును కూడా వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కమిషన్ ను రద్దు చేయాలని కోరుతూ వాళ్లు కోర్టుకు వెళ్లారని తెలిపారు. అందుకు చైర్మన్ వైఖరిని కారణంగా చూపారని అన్నారు. కమిషన్ ను రద్దు చేయడం కుదరదని.. చైర్మన్ పై అభ్యంతరం ఉంటే చైర్మన్ ను మార్చాలని కోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. కోర్టు కేసీఆర్ అభ్యర్థనను తిరస్కరించిందన్నారు. 2015 లో భద్రాద్రి పవర్ ప్రాజెక్టును రూ.7,290 కోట్ల అంచనా వ్యయంతో మొదలు పెట్టారని తెలిపారు.



## అసెంబ్లీలో కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది...:కాంగ్రెస్‌పై హరీశ్‌రావు ఫైర్

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 29:** శాసనసభలో తప్పుడు ప్రకటనలతో అసెంబ్లీని కాంగ్రెస్ తప్పుదోవపట్టిస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అసెంబ్లీ లాబీలో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. "గవర్నమెంట్ డిఫెన్స్‌లో పడినప్పుడు ఏదొక పేపర్ పట్టుకుని సభలోకి వచ్చి డైవర్షన్ చేస్తున్నారు. సభా నాయకుడు సభను తప్పుదోవ పట్టిస్తున్నారు. అదర్ దేన్ అగ్రికల్చర్ మీటర్స్ అనే పదాలను ఎగరగొట్టి చదివారు. అప్పులు 7 లక్షల కోట్లు అని తప్పుగా చెబుతున్నారు. ఇష్టం వచ్చినట్లు అప్పులు చేయలేదని చెప్పే ప్రయత్నం నేను చేస్తుండగా%ొ% మోటర్లకు మీటర్లు పెట్టడానికి సంతకం చేశారని రేవంత్ లేచి సభను మిస్ లీడ్ చేశారు." అని హరీశ్‌రావు మండిపడ్డారు."ఎల్ఆర్ఎస్ కోసం 25 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనీ%ొ% వాటిని క్లియర్ చేస్తే ఆదాయం వస్తుందని భట్టి చెబుతున్నారు. ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హైకోర్టులో కేసు ఫైల్ చేశారు. ఎల్ఆర్ఎస్‌పై కేసు విరమించుకుని ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి రెగ్యులరైజ్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. రేవంత్ రెడ్డి.. తెలంగాణ ఉద్యమంలో ఎమ్మెల్యే పదవికి కనీసం రాజీనామా కూడా చేయలేదు. నాడు కొంతమంది టీడీపీ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు రిజైన్ చేస్తూ జీరాక్స్ కాపీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి కనీసం ఆ జిరాక్స్ కాపీ కూడా ఇవ్వలేదు." అని ఆరోపించారు.



## మీ అహంకారమే మీ పతనానికి కారణం..

### జగన్‌ను మరోసారి కడిగిపారేసిన వైఎస్ షర్మిల

**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూలై 29:** వైఎస్ జగన్‌పై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మరోసారి ధ్వజమెత్తారు. చంద్రబాబు ఏజెంటుగా రాజకీయాలు చేసేవారికి, ప్రజల తరఫున ప్రతి క్షణం ఆలోచించే వారికి మధ్య చాలా తేడా ఉంటుందని వైసీపీ చేసిన ట్వీట్‌పై షర్మిల స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీకి వచ్చి నిలదీయండి అంటే నేను చంద్రబాబుకు కొమ్ముకాసినట్లు ఉందా అని మండిపడ్డారు. మీ మూర?త్వానికి మిమ్మల్ని మ్యూజియంలో పెట్టాలని ఎద్దేవా చేశారు. అద్దంలో చూసుకోమని చెప్పింది అందుకే.. మీకు చంద్రబాబు పిచ్చి పట్టుకుందని అన్నారు. అద్దంలో మీకు ఇప్పుడు కూడా చంద్రబాబే కనబడుతున్నాడని విమర్శించారు.మీ మాటలు చూస్తే జగన్ మీద ద్వేషమే కనిపిస్తోంది తప్ప.. ప్రజా సమస్యలు ఎక్కడా కనిపించడం లేదని వైసీపీ చేసిన విమర్శలపైనా షర్మిల సీరియస్ అయ్యారు. సోషల్ మీడియాలో నన్ను కించపరిచేంత ద్వేషం మీకు ఉంది.. మాకు ద్వేషం లేదు. కానీ తప్పును తప్పు అని చెప్పే ధైర్యం ఉందని స్పష్టం చేశారు. ఒక ప్రతిపక్షం మరో ప్రతిపక్షాన్ని ప్రశ్నించకూడదని ఎక్కడైనా ఉందా అని మండిపడ్డారు. తప్పు చేస్తే ఏ పార్టీనైనా ప్రశ్నించే అధికారం మాకు ఉంది.. అది అధికార పార్టీనా.. లేక ప్రతిపక్షమా అన్నది ముఖ్యం కాదని స్పష్టం చేశారు.. జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీకి వెళ్లకపోవడం తప్పు! కాబట్టే తప్పు అన్నాం! చట్ట సభను గౌరవించకపోవడం తప్పు! కాబట్టే రాజీనామా చేయమన్నాం! అని తెలిపారు.



# కేసీఆర్ సత్యహరిశ్చంద్రుడే..

## రేవంత్‌లా సంచులు మోసే చంద్రుడు కాదు : ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 29:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముమ్మాటికీ సత్యహరిశ్చంద్రుడే అని మాజీ విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తేల్చిచెప్పారు. రేవంత్‌లా సంచులు మోసే చంద్రుడు కాదు అని ఆయన పేర్కొన్నారు. శాసనసభలో విద్యుత్ పద్దులపై చర్చ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. సత్యహరిశ్చంద్రులు అయితే ఎందుకు విద్యుత్ జ్యుడిషియల్ కమిషన్‌కు అడ్డు వస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై జగదీశ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు.విద్యుత్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దొంగతనం దొరికిపోయింది కాబట్టే రేవంత్ రెడ్డి ఎందుకు భుజాలు తడుముకుంటున్నారని జగదీశ్ రెడ్డి నిలదీశారు. మా అధినేత కేసీఆర్ హరిశ్చంద్రుడే. రేవంత్ రెడ్డిలా సంచులు మోసే చంద్రుడు కాదు.. చంద్రుడికి సంచులు మోసి జైలుకు పోయింది రేవంత్ రెడ్డినే అని జగదీశ్ రెడ్డి గుర్తు చేశారు.నేను విద్యుత్ విషయంలో నిజనిజాలు మాట్లాడుతుంటే.. రేవంత్ రెడ్డినే వడివడిగా సభలోకి వచ్చి నాకు అడ్డు తగిలారు. సీఎం సభలో అడుగు పెట్టగానే తప్పుదోవ పట్టింది. కేసీఆర్ కాలు గోటికి మీరు సరిపోతారా..? కేసీఆర్ గురించి మాట్లాడింది రికార్డుల నుంచి తొలగించండి.. సభను హుందాగా నడిపించాలి. సభలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల మీరు ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నట్లు అని జగదీశ్ రెడ్డి అధికారపక్షాన్ని నిలదీశారు.

## గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 29:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను సోమవారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తాజాగా మహారాష్ట్రకు గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్‌ను రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన త్వరలో బాధ్యతలను స్వీకరించనున్నారు. సీపీ రాధాకృష్ణన్ స్థానంలో తెలంగాణ కొత్త గవర్నర్‌గా జిష్ణు దేవ్ వర్మ నియమితులయ్యారు. మరో రెండు రోజుల్లో జిష్ణు దేవ్ వర్మ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రస్తుత గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం అసెంబ్లీ సమావేశాలకు బయలుదేరి వెళ్లారు.



## విద్యుత్‌పై న్యాయవిచారణ కోరింది వాళ్లే - వద్దంటోంది వాళ్లే

### సీఎం రేవంత్‌రెడ్డి




**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 29**: బీఆర్ఎస్ పాలనలో విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణంలో సివిల్ వర్క్స్ అన్నీ గులాబీ నేతల బినామీలకే ఇచ్చారని సీఎం రేవంత్?రెడ్డి ఆరోపించారు. వాళ్ల పార్టీవారికి ఇచ్చిన పనుల్లో వేల కోట్ల అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. శాసనసభ సమావేశాల్లో ఇవాళ విద్యుత్? అంశంపై వాడివేడి చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్?రెడ్డి ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు, యాదాద్రి పవర్‌ప్లాంట్‌పై న్యాయవిచారణ అంశంపై మాట్లాడారు.విద్యుత్ అంశంలో న్యాయవిచారణ కోరిందే బీఆర్ఎస్ సభ్యులని సీఎం రేవంత్?రెడ్డి పేర్కొన్నారు. జగదీశ్వర్‌రెడ్డి చర్లపల్లి జైల్లో ఉన్నట్లు మాట్లాడుతున్నారని, కేసీఆర్‌ను సత్యహరిశ్చంద్రుడికి ప్రతిరూపంలో ఉన్నట్లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. విచారణ కమిషన్ ముందు వాదనలు వినిపిస్తే బీఆర్ఎస్ సభ్యుల నిజాయతీ బయటకు వచ్చేదని వ్యాఖ్యానించారు. విద్యుత్? న్యాయవిచారణ కోరిందివాళ్లే, వద్దంటున్నది వాళ్లేనని రేవంత్ మండిపడ్డారు.

**కొత్త ఛైర్మన్‌ను నియమిస్తాం :** విద్యుత్ కమిషన్ ఎదుట కేసీఆర్ ఎందుకు హాజరుకాలేదని సీఎం రేవంత్? ప్రశ్నించారు. విద్యుత్‌పై విచారణ కొనసాగించాలని సుప్రీం కోర్టు కూడా చెప్పిందని తెలిపారు. విచారణ కమిషన్‌కు కొత్త ఛైర్మన్‌ను సాయంత్రం నియమిస్తామని సీఎం రేవంత్? స్పష్టం చేశారు. జైలుకు వెళ్లాల్సి వస్తుందనే కమిషన్‌కు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లారని , విద్యుత్ అంశంలో విచారణ వద్దని కోర్టును అడిగారని వ్యాఖ్యానించారు.

# ఫ్రీ బస్సు వాడకంలో అల్టిమేట్ సీన్...

## పళ్లు తోముతూ ప్రయాణించిన అక్క..

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 29:** తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ సర్కార్.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకంలో భాగంగా రాష్ట్ర మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించింది. రేవంత్ సర్కార్ ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ఎంతమందికి ఉపయోగపడుతుందో కానీ.. నిత్యం ఏదో ఒక లొల్లి తో వార్తల్లో నిలుస్తూనే ఉంది. అసలే అరకొరగా ఉన్న బస్సుల్లో మహిళలే అధికంగా ప్రయాణిస్తుండటం తో ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక పండుగలు, పబ్బాల సమయంలో సరేసరి. బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసి పోతున్నాయి. అయితే ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకాన్ని కొందరు మహిళలు దుర్వినియోగం చేస్తున్నారు. కొద్దిపాటి దూరానికి కూడా బస్సుల్లో ప్రయాణిస్తూ తోటి ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అయితే విద్యార్థులు, ఉద్యోగులు బస్సుల్లో ప్రయాణం చేయలేక నానాకష్టాలు పడుతున్నారు. ఎట్లాగూ టికెట్ లేకుండా పోవచ్చని కొందరు మహిళలు.. అవసరం ఉన్నా లేకున్నా బస్సులు ఎక్కేస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా ఓ వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఈ వీడియోలో ఓ మహిళ టీజీఎస్ ఆర్టీసీ బస్సులో డ్రైవర్ వెనుక సీట్లో కూర్చుని ఉండటం చూడొచ్చు. అయితే సదరు మహిళ.. తాపీగా కిటికీ పక్కన సీట్లో కూర్చుని, బయటి వ్యూ చూస్తూ బ్రష్ చేస్తూ ఉండటం వీడియోలో కనిపించింది.



ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL

# అర్జున్‌కు మిస్సైన మెడల్.. నాలుగవ స్థానంలో భారత షూటర్

**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 29:** పారిస్: పారిస్ ఒలింపిక్స్ షూటింగ్‌లో భారత్ షూటర్ అర్జున్ బబుటా పతకాన్ని మిస్ చేసుకన్నాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో పతకాన్ని గెలుచుకునే అవకాశాన్ని కోల్పోయాడు. ఫైనల్లో తొలి రౌండ్ నుంచి అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించిన అతను చివరలో తడబడ్డాడు. దీంతో అతను 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో అతను నాలుగో స్థానంలో నిలిచాడు. ఫైనల్లో అర్జున్ 208.4 పాయింట్లు స్కోర్ చేశాడు. ఒక్క పొజిషన్ తేడాతో అతను మెడల్‌ను చేజార్చుకున్నాడు. 5 షాట్ సిరీస్‌లో 52 పాయింట్లతో మంచి స్టార్ట్ ఇచ్చిన అర్జున్.. ఆ తర్వాత క్రమంగా తన పొజిషన్ పోగొట్టుకున్నాడు. 10 షాట్స్ పొజిషన్‌లో మూడవ స్థానంలో ఉన్న అతను.. ఆ తర్వాత తేరుకోలేకపోయాడు.






## ఇట్ల తయారయ్యారు ఏంద్రా. మెట్రోలోనే పాడు పని.. ఆ తర్వాత



**ఇయ్యాల్టి న్యూస్, క్రైం, జూలై 29:** గంజాయి.. ఇప్పుడు ప్రభుత్వాలకు పెద్ద సమస్యగా మారిపోయింది. డ్రగ్స్‌ను రూపుమాపేందుకు ఎంతగా ప్రయత్నిస్తున్నా.. ఈ జాడ్యం మాత్రం వీడేలా కనిపించడం లేదు. ముఖ్యంగా గంజాయి అయితే ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా దొరకుతుంది. యూత్ పెద్ద ఎత్తున గంజాయి అలవాటు పడటం పట్ల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలానే కొనసాగితే.. దేశం పీకల్లోతు కష్టాల్లోకి వెళ్తుందని హెచ్చరిస్తున్నారు. అయితే గతంలో గుట్టుచప్పుడు కాకుండా.. గంజాయి తాగేవారు. కానీ ఇప్పుడు చాలా మంది బాహాటంగానే ఈ పాడు పనికి పూనుకుంటున్నారు. కొందరైతే.. తాము ఏదో గొప్ప పని చేసినట్లు.. ఆ ఫోటోలను, వీడియోలను ఇన్ స్టాలో షేర్ చేస్తున్నారు. తాజాగా ఓ యువకుడు చెన్నై మెట్రోలో ఓ యువకుడు గంజాయిని రోల్ చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విమ్కోనగర్ నుంచి విమానాశ్రయం వరకు వెళ్లే మెట్రో ట్రైన్‌లో ఓ యువకుడు ప్రయాణికులు విచ్చలవిడిగా ప్రవర్తించినట్లు తెలిసింది. అన్నాడీఎంకే సీనియర్ నేత.. జయకుమార్ ఈ ఫొటో తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. గాలింపు చర్యలు చేపట్టి సదరు యువకుడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతడిని తండయార్‌పేటకి చెందిన భువనేష్‌గా గుర్తించారు. అతను ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గంజాయి ఎక్కడ నుంచి వచ్చింది.. ఎవరి నుంచి కొనుగోలు చేశాడమే అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## 171 ఏళ్ల క్రితం సముద్రంలో మునిగిన ఓడ..


### తాజాగా బయటపడ్డ భారీ నిధి.. విలువెంతో తెలిస్తే షాకే ..



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 29:** బాల్టిక్ సముద్రం లోతులో మునిగిపోయిన 171 ఏళ్ల నాటి ఓడను గుర్తించారు పరిశోధకులు. స్వీడన్ తీరంలో దాదాపు 190 అడుగుల లోతులో మునిగిపోయిన ఓడ శిథిలాలను పోలిష్ డైవర్ల బృందం కనుగొంది. ఓడలో షాంపైన్, వైన్, మినరల్ వాటర్, పింగాణీ వస్తువులను వారు కనుగొన్నారు. పరిశోధకులు తెలిపిన వివరాల మేరకు.. బాల్టిక్ సముద్రం అడుగున మునిగిపోయిన ఓడ ఓపెన్ చేయని సీల్డ్ షాంపైన్ సీసాలతో నిండి ఉన్నట్టుగా గుర్తించారు. ఈ నౌక 19వ శతాబ్దానికి చెందినది. ఏళ్ల తరబడి నీళ్లలో మునిగిపోయి ఉన్న ఈ ఓడ ఖరీదైన మద్యం సీసాలతో నిండిపోయి ఉందని పోలిష్ డైవర్ల బృందం తెలిపింది. ఈ ఓడలో 100 కంటే ఎక్కువ షాంపైన్ బాటిళ్లు ఉన్నాయని పరిశోధకులు తెలిపారు. డైవర్లు సముద్రపు అడుగుభాగంలో మునిగిపోయిన ఓడల కోసం కొన్నేళ్లుగా వెతుకుతున్నందున, ఈ ఆవిష్కరణ చాలావరకు యాదృచ్ఛికమని అన్నారు పరిశోధకులు. వందల ఏళ్ల క్రితం సముద్రంలో మునిగిపోయిన ఓడను కనుగొన్న టీమ్ లీడర్ టోమాస్ట్ స్టాచురా ఒక పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ.. నీళ్లలో మునిగిపోయిన ఓడ శిథిలాలలో షాంపైన్, మినరల్ వాటర్, పింగాణి పాత్రలు పెద్ద మొత్తంలో ఉన్నాయని చెప్పారు. స్టాచురా బాల్టిక్ సముద్రంలో ఇప్పటి వరకు వేలాది శిథిలాలను ఫోటో తీశాడు. ఈ క్రమంలోనే స్వీడన్‌లోని ఓలాండ్ ద్వీపానికి 37 కిలోమీటర్ల దూరంలో సముద్రంలో ఈ ఓడను గుర్తించారు. బృందంలోని ఇద్దరు డైవర్లు చిన్న డైవ్ కోసం నీటిలోకి వెళ్లారని, అయితే రెండు గంటల వరకు బయటకు రాలేదని, ఆ తర్వాత నీటి అడుగున ఆసక్తికరమైన విషయం ఉందని వారు గ్రహించారు. అక్కడ ఆసక్తికరమైన అంశం ఏదో ఉందని తమకు ముందుగానే తెలుసునని అతను చెప్పాడు. శిథిలాలలో లభించిన సీసాలు జర్మన్ కంపెనీ సెల్టర్స్ బ్రాండ్ పేరుతో ఉన్నాయని చెప్పారు. 1850-1867 మధ్య కాలంలో ఓడ మునిగిపోయి ఉండొచ్చని ఓడలో దొరికిన సీసాల ఆధారంగా గుర్తించారు పరిశోధకులు. ఈ బాటిల్స్ ప్యాక్ చేసిన కంపెనీ నేటికీ ఉందని చెప్పారు. అయితే, ఈ ఓడలో దొరికిన పాత షాంపైన్ తాగవచ్చో లేదో చూడాల్సి ఉందన్నారు. అయినప్పటికీ షాంపైన్ కోసం డైవర్లు ఎంతో ఆశగా ఉన్నారు. మధ్య జర్మనీలోని ఒక ఖనిజ నీటి బుగ్గ నుండి వచ్చిన నీరు కూడా చాలా ముఖ్యమైనదని చెప్పారు. ఈ నీటిని 800 సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా రవాణా చేస్తున్నారు.


## విడాకులు తీసుకున్న స్త్రీలు, వితంతువులే అతని టార్గెట్..

### ఏకంగా 25 పెళ్లిళ్లు చేసుకున్న ఘనుడు ..?



**ఇయ్యాల్టి న్యూస్, క్రైం, జూలై 29:** మల్లాది వెంకట కృష్ణ మూర్తి మిస్టర్ వి నవలలో ఒక యువకుడు అమ్మాయిలకు వల వేసి పెళ్లి చేసుకుని నగలు, నగదు తీసుకుని పారిపోయేవాడు. అంతేకాదు తాను మరణించినట్లు ఒక సన్నివేశాన్ని క్రియేట్ చేసేవాడు. ఇలాంటి సంఘటన నిజ జీవితంలో జరుగుతుందని ఎప్పుడైనా అనుకున్నారా.. అందుకు సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది తాజా సంఘటన. ఒక యువకుడు ఒకటి కాదు రెండు ఏకంగా 25కి పైగా పెళ్లిళ్లు చేసుకున్నాడు. పాపం పండి ఇన్నాళ్ళకు పోలీసులకు చిక్కాడు. ఈ ఘటన మహారాష్ట్రలోని పాల్ఘర్‌లోని నలసోపరాలో చోటు చేసుకుంది. పెళ్లి మీద పెళ్లి చేసుకున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పెళ్లి చేసుకున్న కొన్ని రోజుల తర్వాత నిందితుడైన వరుడు వధువు వద్ద ఉన్న విలువైన వస్తువులు, నగలు, నగదు అన్నీ తీసుకుని పారిపోయేవాడు. అయితే ఈ వ్యక్తి 6 సార్లు జైలుకు కూడా వెళ్లాడు. అయినా పెళ్ళి మీద పెళ్లి చేసుకోవడం మాత్రం మానలేదు. నగరం, పేరు మార్చుకుని కొత్త ప్రదేశంలో అమ్మాయిలకు వల విసిరేవాడు. ఈ వ్యక్తి అసలు పేరు ఫిరోజ్ షేక్. అయితే అన్వర్, రెహ్మాన్, రహీమ్, సురేష్ , రమేష్ ఇలా ఎన్నో మారు పేర్లు కూడా ఉన్నాయి. ఫిరోజ్ ఇప్పటి వరకూ 25 మందికి పైగా మహిళలను పెళ్లి చేసుకుని బాధితులుగా మార్చాడు. ఫిరోజ్ ఉద్దేశ్యం ఒక్కటే.. యువతులను పెళ్లి చేసుకుని వారిదగ్గర ఉన్న దోచుకుని పారిపోతాడు. అయితే ఫిరోజ్ పెళ్లి చేసుకున్న అమ్మాయిలు లేదా మహిళల్లో ఎక్కువగా వితంతువులు లేదా విడాకులు తీసుకున్నవారే ఉండడం విశేషం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు ఫిరోజ్ మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ షాదీ.కామ్‌లో పలు ప్రొఫైల్స్ సృష్టించాడు. దీని ద్వారా అతను వితంతువులు, విడాకులు తీసుకున్న మహిళలకు లేదా ఎక్కువ వయస్సు ఉన్న మహిళలకు అభ్యర్థనలు పంపేవాడు. వారితో స్నేహం చేసి తర్వాత ప్రేమ ఉచ్చులో బంధించేవాడు. పెళ్లి కూడా చేసుకుని కొద్దిరోజులు పెళ్లికూతురు దగ్గరే ఉండేవాడు. ఆ తర్వాత రాత్రికి రాత్రే వధువుకి సంబంధించిన విలువైన వస్తువులు, నగలు, నగదు తీసుకుని పారిపోయేవాడు. చాలా మంది మహిళలు తాము పెళ్లి పేరుతో మోసపోవడం అవమానంగా భావించి ఈ విషయంపై ఫిర్యాదు చేయలేదు. అయితే ఫిరోజ్ మోసానికి గురైన ఓ మహిళ నలసోపరాలో కేసు పెట్టింది. ఈ స్త్రీ విషయంలో కూడా అలాగే చేసాడు. ఆమె ఫిర్యాదు మేరకు నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు పథకం వేశారు. నకిలీ అమ్మాయి పేరుతో సోషల్ అకౌంట్ క్రియేట్ చేశారు. ఫిరోజ్‌ను సంప్రదించారు. పెళ్లి గురించి చర్చలు జరిగాయి. నిందితుడు త్వరలోనే ఈ ఉచ్చులో చిక్కుకున్నాడు. అప్పుడు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు.

## పచ్చని సంసారంలో అక్రమ సంబంధం చిచ్చు.. ఏం జరిగిందంటే..!



**ఇయ్యాల్టి న్యూస్, క్రైం,, జూలై 29:** పచ్చని సంసారంలో అక్రమ సంబంధం అగ్గిరాజేసింది. కుటుంబాన్ని ముక్కలు చేసింది. మనస్తాపంతో వివాహిత అర్ధాంతరంగా తనువు చాలించింది. ఈ దారుణం బెంగళూరులో చోటుచేసుకుంది. మానస (25).. దిలీప్ అనే యువకుడ్ని ఆరేళ్ల క్రితం వివాహం చేసుకుంది. ఈ దంపతుల దాంపత్యానికి గురుతుగా ఐదేళ్ల కుమార్తె ఉంది. సాఫీగా సాగిపోతున్న ఫ్యామిలీలోకి మరో మహిళ ఎంట్రీ ఇచ్చింది. అంతే పచ్చని సంసారంలో అగ్గిరాజేసింది. ఇంకేముంది నిత్యం గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఏడాదిన్నర నుంచి దిలీప్.. మరో మహిళతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయంలో నిత్యం భార్యాభర్తల మధ్య ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. అయితే గత అర్ధరాత్రి బెంగళూరులోని బ్యాదరహళ్లిలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మానస ప్రాణాలు తీసుకుంది. అయితే ఆత్మహత్యకు ముందు మొబైల్‌లో వీడియో ఆన్ చేసి.. తన గోడు వెళ్లబుచ్చుకుంది. భర్త అక్రమ సంబంధం కారణంగా ప్రాణాలు తీసుకుంటున్నట్లు వాపోయింది. ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్న కూడా.. ఒక్క నిమిషం ఆగి మొబైల్ ఆఫ్ చేసి తనువు చాలించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. భర్త అక్రమ సంబంధంతోనే మానస ప్రాణాలు తీసుకుందని పోలీసులు చెప్పారు. ఈ విషయంలో ఇరువురి మధ్య గొడవలు జరుగుతూనే ఉన్నాయని.. దీంతో మానస బలవన్మరణానికి పాల్పడిందని పేర్కొన్నారు. మానసను ఆస్పత్రికి తీసికెళ్లేలోపే ప్రాణాలు వదిలిందని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## మరోసారి ట్రంప్ అధ్యక్షుడైతే ...
## భారత్-అమెరికా సంబంధాలు ఎలా ఉండబోతున్నాయి?



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్ జూలై 29:** అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా కమలా హారిస్, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉన్నారు. ఈ ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధిస్తారని ఎన్నో సర్వేలు చెబుతున్నాయి. ఇదే కనుక జరిగితే ట్రంప్ మరోసారి అమెరికా అధ్యక్షుడవడం ఖాయం. ట్రంప్ అధ్యక్షుడైతే భారత్, అమెరికా సంబంధాలు ఎలా మారతాయో తెలుసుకుందాం. మొదటగా ఉక్రెయిన్ పై ప్రభావం చూపే నాటో నుంచి ట్రంప్ వైదొలగవచ్చు. ఇంకా చైనాకు వ్యతిరేకంగా సృష్టించడానికి ట్రంప్ భారతదేశం వంటి దేశాలను కూడా చూస్తారని ఆశించవచ్చు. ఓహియో సెనేటర్ నీరజ్ అంటాని ప్రకారం అనేక భారతీయ రాజకీయ సమస్యలపై తటస్థంగా ఉన్న ట్రంప్ హయాంలో అమెరికా-ఇండియా సంబంధాలు బాగానే ఉన్నాయి. ట్రంప్, అతని వైస్ ప్రెసిడెంట్ నామినీ ఇద్దరూ రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించాలని, రష్యాతో సంబంధాలను మెరుగుపరచుకోవాలని నొక్కి చెప్పారు. ఒక్క ఫోన్ కాల్‌తో ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపగలనని ట్రంప్ ఇటీవల అన్నారు. చైనాకు సంబంధించి, అమెరికాకు అతిపెద్ద ముప్పు అని వాన్స్ స్పష్టంగా చెప్పారు. ట్రంప్ చైనా గురించి పెద్దగా మాట్లాడనప్పటికీ, అతను చైనా వ్యాపార విధానాలకు వ్యతిరేకంగా తన స్వరాన్ని నిరంతరం మాట్లాడాడు. ట్రంప్ మొదటి టర్మ్ సమయంలో భారతదేశం, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిగాయి. అయితే, భారత్‌కు చెందిన జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్ (జీఎస్‌పీ)ని ట్రంప్ రద్దు చేశారు. దీని ప్రకారం, అభివృద్ధి చెందుతున్న దేశాలకు అమెరికాకు సుంకం లేని వస్తువులను ఎగుమతి చేయడానికి అనుమతి ఉంది. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం ఇటీవలి కాలంలో క్షీణించింది. 2022-23లో అమెరికా భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. కాకపోతే ఇప్పుడు ఆ స్థానంలో చైనా ఉంది.

## కేజ్రీవాల్ బెయిల్‌పై హైకోర్టు తీర్పు రిజర్వ్



**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 29:** ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ సోమవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై మొదట విచారణ ట్రయల్ కోర్టులో జరగాలని సీబీఐ తెలిపింది. కేజ్రీవాల్ సహా ఆరుగురిపై చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు హైకోర్టుకు సీబీఐ తెలిపింది. కేసు దర్యాప్తును కేజ్రీవాల్ ప్రభావితం చేస్తున్నారని.. కేజ్రీవాల్ అరెస్ట్ తర్వాత అనేక ఆధారాలు వెలుగులోకి వచ్చాయని సమగ్ర దర్యాప్తు జరిపి చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు న్యాయస్థానానికి సీబీఐ తెలిపింది. ఇదిలా ఉంటే లిక్కర్ పాలసీకి సంబంధించి సీబీఐ కేసులో కేజ్రీవాల్‌కి వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవని.. రికవరీ కూడా లేదని కేజ్రీవాల్ తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వి తెలిపారు. లిక్కర్ పాలసీ ఆమోదంపై కేజ్రీవాల్‌తో పాటు ఢిల్లీ ఎల్జీ సహా 15 మంది సంతకం చేశారరని.. వారిని ఎందుకు నిందితులుగా సీబీఐ చేర్చలేదని సింఘ్వి ప్రశ్నించారు. సీబీఐ కేసులో కేజ్రీవాల్ సూత్రధారి అంటున్నారని.. కానీ ఆయనకు వ్యతిరేకంగా ఆధారాలు లేవన్నారు. విజయ్ నాయర్‌కి సీబీఐ కేసులో బెయిల్ వచ్చిందని.. కేజ్రీవాల్‌కు కూడా బెయిల్ ఇవ్వాలని అభిషేక్ సింఘ్వి కోర్టును కోరారు.

## కోచింగ్ సెంటర్ దుర్ఘటనపై మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక వ్యాఖ్యలు




**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 29:** ఢిల్లీ లోని ఓల్డ్ రాజేందర్ నగర్ లో ఓ కోచింగ్ సెంటర్‌లోకి వరద నీరు ప్రవేశించి ముగ్గురు విద్యార్థులు మరణించిన విషయం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనపై ఉవ్వెత్తున నిరసన వ్యక్తమవుతోంది. ఈ ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలంలూ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఇక ఈ ఘటనపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజ్యసభలో మాట్లాడారు. కోచింగ్ సెంటర్‌లో జరిగిన దురదృష్టకర ఘటనలో ముగ్గురు యూపీఎస్సీ అభ్యర్థులు ప్రాణాలు కోల్పోవడం విచారకరమని అన్నారు. ఈ ఘటనలో అధికారుల నిర్లక్ష్యం ఉందని, జవాబుదారీతనం నెలకొనేలా చూస్తే ఇలాంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడటం తమ బాధ్యతని మంత్రి వివరించారు. కాగా, కోచింగ్ సెంటర్‌లో విషాద ఘటనపై దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమవడంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఈ ప్రాంతంలో ఆక్రమణలను తొలగించి నీరు సాఫీగా సాగేందుకు అక్రమ నిర్మాణాలను బుల్డోజర్లతో తొలగిస్తున్నారు. డ్రైయిన్లకు అడ్డుగా నిర్మించిన బ్లాక్స్‌ను పొక్లెయిన్‌లతో సిబ్బంది తొలగిస్తున్నారు.

## కేంద్రం పన్నిన చక్రవ్యూహాన్ని ఛేదించి తీరుతాం..

### లోక్‌సభలో నిప్పులు చెరిగిన రాహుల్‌గాంధీ




**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 29:** లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ కేంద్ర సర్కారుపై నిప్పులు చెరిగారు. బడ్జెట్‌పై చర్చలో భాగంగా సోమవారం మాట్లాడిన ఆయన.. తూటాల్లాంటి మాటలతో బీజేపీ సర్కారుపై విరుచుకుపడ్డారు. మోదీ ప్రభుత్వం తన అధికారాన్ని కాపాడుకోవడం మూడు రకాల బలగాలను ఉపయోగించి దేశంలో చక్రవ్యూహం నిర్మించిందని విమర్శించారు. కేంద్రం నిర్మించిన చక్రవ్యూహం ప్రజలకు హానికరంగా మారిందని, ఈ చక్రవ్యూహాన్ని తాము ఛేదించి తీరుతామని రాహుల్‌గాంధీ శపథం చేశారు. కేంద్ర చక్రవ్యూహంలో భాగమైన మూడు రకాల బలగాల్లో ఒకటి ఆర్థిక బలగమని, ఇది అదానీ, అంబానీ చేతుల్లో ఉన్నదని అన్నారు. రెండో బలగం కేంద్ర దర్యాప్తు సంస్థలని చెప్పారు. ఈడీ, సీబీఐ, ఐటీలను ఉపయోగించి ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్ష సాధిస్తోందని మండిపడ్డారు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/
04
మంగళవారం 30 జులై2024

# చూసి ముర్వాలే



## ఫిలిం సిటీలో 'పుష్ప 2' క్లైమాక్స్.. జాయిన్ అవ్వనున్న ఐకాన్ స్టార్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 29: ఫ్యామిలీతో కలిసి ట్రిప్‌కు వెళ్లిన టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇండియా తిరిగి వచ్చేశాడు. గత కొన్ని రోజులుగా అల్లు అర్జున్‌కు, దర్శకుడు సుకుమార్‌కి మధ్య గొడవలు అయినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. పుష్ప 2 షూటింగ్ చివరి దశలో ఉన్న క్రమంలో వీరిద్దరి మధ్య గొడవ జరిగినట్లు.. దీంతో అల్లు అర్జున్ సుకుమార్ మీద ఉన్న కోపంతో తన గడ్డం తీసేసి ట్రిప్‌కు చెక్కేసారని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అయ్యాయి. అయితే ఈ వార్తలు ఫేక్ అని చిత్రబృందం తర్వాత క్లారిటీ ఇచ్చింది. ఇదిలావుంటే తాజాగా హైదరబాద్‌కు వచ్చిన అల్లు అర్జున్ పుష్ప షూటింగ్‌లో పాల్గోనడానికి రెడీ అవుతున్నట్లు సమాచారం అందింది.రామోజీ ఫిలిం సిటీలో ఇప్పటికే పుష్ప షూటింగ్ జరుగుతుండగా.. ఇతర నటులపై కొన్ని సీన్స్? తెరకెక్కిస్తున్నారు. అయితే వచ్చే నెల కొత్త షెడ్యూల్‌తో పాటు క్లైమాక్స్ సీన్స్ షూటింగ్ జరగబోతుండగా.. అల్లు అర్జున్ జాయిన్ కాబోతున్నట్లు సమాచారం.




## మూడు రోజుల్లో రూ. 3650 కోట్లు.. బాక్సాఫీస్ దుమ్మురేపుతున్న 'డెడ్‌పూల్ అండ్ వాల్వరిన్'

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 29:** హాలీవుడ్ నుంచి డెడ్‌పూల్ అండ్ వాల్వరిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపుతుంది. మార్వెల్ స్టూడియోస్ నుంచి వచ్చిన ఈ చిత్రం మార్వెల్ %ఊ% డెడ్‌పూల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా రాగా.. జూలై 26న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రీమియర్ షో నుంచే బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం గ్లోబల్ వైడ్‌గా కలెక్షన్ల సునామి సృష్టిస్తుంది. తాజాగా ఈ చిత్రం వరల్డ్ వైడ్‌గా మూడు రోజుల్లో రూ. 3650 కోట్ల కలెక్షన్లు సాధించినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా అరుదైన రికార్డును నమోదు చేసుకుంది. 2024లో అత్యధిక కలెక్షన్లు రాబట్టిన నం.1 చిత్రంగా డెడ్‌పూల్ అండ్ వాల్వరిన్ నిలిచింది. మరోవైపు ఇండియాలో మూడు రోజుల్లో రూ.83 కోట్ల కలెక్షన్లు రాబట్టింది. ఈ సినిమాలో వోల్వారిన్‌గా హ్యూగ్ జాక్‌మాన్, డెడ్‌పూల్‌గా ర్యాన్ రేనాల్డ్స్ నటించారు. ఎమ్మా కొరిన్, మోరెనా బక్కరిన్, రాబ్ డెలానీ, లెస్లీ ఉగ్గమ్స్, కరణ్ సోని, మాథ్యూ మక్‌ఫాడియన్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించగా.. షాన్ లెవీ దర్శకత్వం వహించాడు. మార్వెల్ స్టూడియోస్, 21 ల్యాప్స్ ఎంటర్‌టైనమెంట్ సంయుక్తంగా నిర్మించాయి.




## పారిస్ ఒలంపిక్స్‌లో ఇండియన్ ప్లేయర్స్ కోసం.. బ్యాగ్ నిండా ఫుడ్ తీసుకెళ్లిన చిరంజీవి భార్య..

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 29:** పారిస్ లో ఒలంపిక్స్ గ్రాండ్ గా జరుగుతున్న సంగతి తెలిసిందే. పారిస్ ఒలంపిక్స్ కి మెగా ఫ్యామిలీ కూడా వెళ్లారు. గత మూడు రోజులుగా చిరంజీవి, రామ్ చరణ్, సురేఖ, ఉపాసన.. నలుగురూ కలిసి పారిస్ ఒలంపిక్స్ లో సందడి చేస్తున్నారు. ఇక పీవీ సింధు మెగా ఫ్యామిలీకి క్లోజ్ అని తెలిసిందే. ఈ క్రమంలో పీవీ సింధు వెంటే ఉండి ఆమెకు సపోర్ట్ చేస్తూ ఎంకరేజ్ చేస్తున్నారు మెగా ఫ్యామిలీ. పారిస్ ఒలంపిక్స్ లో ప్లేయర్స్ ఉండే చోట ఇండియన్ ఫుడ్ లేదు. ఈ విషయం సింధు చెప్తుండగా ఉపాసన వీడియో తీసి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేసింది. అయితే ఇంకో స్టోరీలో ఇండియన్ ప్లేయర్స్ కోసం అత్తమ్మాస్ కిచెన్ నుంచి తీసుకొచ్చిన ఇన్‌స్టంట్ ఫుడ్ ప్యాకెట్స్ చూపించింది. ఉపాసన, చిరంజీవి భార్య సురేఖ కలిసి అత్తమ్మాస్ కిచెన్ అని ఫుడ్ బిజినెస్ రన్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ఇండియన్ ట్రెడిషన్ ఇన్‌స్టంట్ ఫుడ్ తో పాటు పచ్చడ్లు, పొడులు.. ఇలా పలు ఐటమ్స్ అమ్ముతారు. అయితే ఇండియా నుంచి బోలెడన్ని ఉప్మా, పులిహార, పచ్చడ్లు.. ఇలా రకరకాల ఇన్‌స్టంట్ ఫుడ్స్ ప్యాకెట్స్ బ్యాగ్ నిండా తీసుకెళ్లారు మెగా ఫ్యామిలీ. ఆ బ్యాగ్ ని కూడా వీడియో తీసి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పెట్టింది ఉపాసన. ఆ ఫుడ్ అంతా అక్కడ ఉన్న ఇండియన్ ప్లేయర్స్ కి ఇవ్వనున్నారు మెగా ఫ్యామిలీ. దీంతో ఇండియన్ ప్లేయర్స్ కి ఇండియా ఫుడ్ తీసుకెళ్లి పెట్టినందుకు మరోసారి అభిమానులు, నెటిజన్లు మెగా ఫ్యామిలీని అభినందిస్తున్నారు. పనిలో పని అత్తమ్మాస్ కిచెన్ ప్రమోషన్ కూడా అవుతుందని భావిస్తున్నారు.






## గ్లామర్ డోస్ పెంచిన శ్రద్ధా శ్రీనాథ్ ... 'మెకానిక్ రాకీ'లో మామూలుగా ఉండదేమో ?

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 29: ట్రెడిషనల్ ఇమేజ్ ముద్ర నుంచి కన్నడ భామ శ్రద్ధా శ్రీనాథ్ బయటకు రావాలని చూస్తున్నట్టు ఉన్నారు. గ్లామర్ డోస్ పెంచిన ఫోటోలు షేర్ చేస్తున్నారు.

## కొత్త బంగారు లోకం హీరోయిన్ ఓవర్ హాట్ షో.. కొత్త కొత్త అందాలు చూపిస్తూ..!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 29: టాలీవుడ్‌లోకి అడుగు పెడుతున్న హీరోయిన్లలో చాలా తక్కువ మంది మాత్రమే ఫస్ట్ మూవీతోనే హైలైట్ అవుతున్నారు. అలాంటి వారే మంచి మంచి ఆఫర్లను సైతం అందుకుంటున్నారు. అందులో శ్వేత బసు ప్రసాద్ ఒకరు. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన పిక్స్‌పై మీరే లుక్కేయండి.






## పచ్చిగా ప్రగ్యా అందాల ఆరబోత.. ఈ ఫొటోలు చూశారంటే మైండ్ బ్లాకే!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 29: సినీ రంగంలో హీరోయిన్లుగా కొనసాగాలంటే అందం, యాక్టింగ్, అదృష్టం కూడా ఉండాలి. ఇవన్నీ ఉన్నా కొందరు భామలు మాత్రం సరైన జాగ్రత్తలు తీసుకోక ఇబ్బంది పడుతున్నారు. అలాంటి వారిలో క్యూట్ హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ ఒకరు. ఈ భామ తాజాగా వదిలిన ఫొటోలను మీరే చూడండి.

## నడుము ఒంపులు... నాభి అందాలు.. గ్లామర్ షోతో అనన్య కనువిందు

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 29: అచ్చ తెలుగు అమ్మాయి అనన్య నాగళ్ల మరోసారి గ్లామర్ షో తో ఆకట్టుకుంది. నడుము ఒంపులు, నాభి అందాలతో కుర్రకారును కవ్వించింది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

PUBLISHED AND PRINTED BUY K.RAKESH. ON BEHALF OF RRR MEDIA ..Editor : **RR RATHNA**, Address.Patel Nagar Chowrastha, Amberpet, Hyderabad,Telangana - 500013.
**RNI NO. T/TG/2024/ 1093** ..Mobile No : 7013794396, 9949152838 ,Website : www.eyyaltynews.comEMAIL ..ramannews9@gmail.com.